
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

తెలంగాణ ఏర్పాటు కంటే ముందు రాష్ట్రంలో ఎకరా భూమి రూ.రెండు, మూడు లక్షలకు కూడా అమ్ముడయ్యేది కాదు. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ చేపట్టిన పాలనా విధానాలతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. సాగు విస్తీర్ణంతోపాటు ఉత్పత్తి పెరిగింది. రైతులు సుఖసంతోషాలతో బతుకుతున్నారు. సొంతూర్ల లోనే ఉపాధి లభిస్తుండటంతో వలసలు బంద్ అయ్యాయి. ఇంత మంచిగున్న రైతులపై కాంగ్రెస్ పగబట్టింది. నిరంతర కరెంట్ అవసరం లేదంటున్నది. 10 హెచ్‌పీ మీటర్లు బిగించుకోవాలంటున్నది. ఏకంగా ధరణి రద్దు చేస్తాం అంటున్నది. వీటిన్నింటితో రైతుబంధుపై నీలినీడలు కమ్ముకొనున్నాయి. ఫలితంగా ఒక్కసారిగా భూముల ధరలు పడిపోనున్నాయి. పటిష్టంగా ఉన్న గ్రామీణ వ్యవస్థ కుప్పకూలనుంది. భూములకు రక్షణ లేకుండా పోతుంది. సాగు విస్తీర్ణం, ఉత్పత్తిపై దెబ్బ పడుతుంది. ఉపాధికి గండి పడి.. మళ్లీ వలసల బాట పట్టాల్సి వస్తుంది. భూములకు ధరలు లేక కొద్దిపాటి అప్పులతో ఆత్మహత్యలే శరణ్యమవుతాయి. ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. మొత్తంగా వ్యవసాయ రంగమే కుదేలవుతుంది. –యాదాద్రి భువనగిరి, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)

తిరిగి రైతు వెన్ను విరిచేలా వ్యవహారం

పచ్చబడ్డ వ్యవసాయంపై రోజుకో కుట్ర

మొదటికే మోసమంటూ రైతుల్లో భయాందోళనలు





# పచ్చని బతుకులను పగబట్టిన కాంగ్రెస్

### భూముల ధరలు పడిపోతయ్

నాకు 3 ఎకరాల భూమి ఉంది. తాతల నాటి నుంచి వ్యవసాయం చేస్తూ బతుకుతున్నం. ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరిగుట్టను అభివృద్ధి చేయడం తోపాటు పెట్టుబడి సాయం, ధరణి పోర్టల్‌ను తీసుకురావడంతో మా ప్రాంత భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఒక్కప్పుడు ఎకరానికి రూ.5 నుంచి 10 లక్షలు మాత్రమే పలికేది. అలాంటిది గత ఐదేండ్లుగా ఎకరం కోటి రూపాయల వరకు పలుకుతుంది. యాదగిరిగుట్ట చుట్టుపక్కల సుమారు 25 కిలోమీటర్ల వరకు ప్రధాన రోడ్డు ప్రాంతంలో ఎకరానికి కోటి పెడితేనే దొరుకుతుంది. ఎకరం భూమి ఉన్న రైతు కోటీశ్వరుడే. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణి రద్దు చేస్తామంటున్నారు. పట్వారీల అజమాయిషీ వస్తే రైతులు తమ భూములపై హక్కులు కోల్పోతారు. కౌలుదారు కాలం వస్తే యజమాని భూమిని కౌలుకు ఇవ్వడు. దాంతో భూములన్నీ బీడు పడి ధరలు భారీగా తగ్గిపోతాయి.

–గొట్టిపర్తి బాలరాజు, రైతు, మాసాయిపేట, యాదగిరిగుట్ట

### 3 గంటల కరెంట్‌తో ఆగమే..

ఉమ్మడి ఏపీలో రైతన్న కరెంట్ కష్టాలు అన్నీఇన్నీ కావు. నాలుగైదు గంటల కరెంట్‌తో తీవ్ర ఇబ్బందులు పడేవారు. అసలు విద్యుత్ ఎప్పుడు వస్తుందో..? ఎప్పుడు పోతుందో? కూడా తెలియని దుస్థితి. అటు చెరువుల్లో నీళ్లు లేక.. ఇటు బోరుబావులు నడవడానికి కరెంట్ లేక అన్నదాత అరిగోస పడ్డారు. కరెంటు కూడా లోఓల్టేజీతో రావడంతో మోటర్లు కాలిపోయేవి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేవి. వాటి మరమ్మతుల కోసం రైతులు తిరిగి ఖర్చులు పెట్టుకోవాల్సి వచ్చేది. రాత్రి వేళ కరెంట్‌తో బాయికాడ మోటర్ల కోసం వెళ్లిన ఎంతో మంది రైతులు మృత్యువాత పడ్డారు. విద్యుదాఘాతం, పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయేవారు.

### ధరణి రద్దుతో భూములకు రక్షణ కరువు

సీఎం కేసీఆర్ దూరదృష్టితో అవినీతి, లంచగొండితనం తొలగించి, పారదర్శకత కోసం ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో సహా ఆ పార్టీ సీనియర్ నేతలు అనేక సందర్భాల్లో ప్రకటించారు. అంతటితో ఆగకుండా పాత పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొస్తామంటూ స్పష్టం చేశారు. ధరణి పోవడంతో లంచావతారులు పుట్టుకొస్తారు. డబ్బులు ఇవ్వందే ఫైల్ ముందుకు కదలదు. భూరికార్డులు మారుతాయి. సెటిల్మెంట్లకు తెరలేసి గొడవలకు అవకాశం ఏర్పడుతుంది. ఒకరి భూమి మరొకరి పేరు మీదకు మార్చుకుంటారు. భూములకు రక్షణ లేకుండా పోతుంది.

### సాగు విస్తీర్ణం, ఉత్పత్తిపై దెబ్బ

తెలంగాణ వచ్చినంక వ్యవసాయ రంగం బాగుపడ్డది. జిల్లాలో సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెరగడమే ఇందుకు ఉదాహరణ. తొమ్మిదేండ్లలో రెండు రెట్లు సాగు విస్తీర్ణం, మూడు రెట్లు ఉత్పత్తి అధికమైంది. 24 గంటల ఉచిత కరెంట్, పంట పెట్టుబడి సాయంగా ఎకరాకు ఏటా రూ. 10వేలు, పుష్కలంగా నీళ్లు, అందుబాటులో ఎరువులు, రసాయనాలు, పండిన పంటకు గిట్టుబాటు ధర తదితర పథకాలు, కార్యక్రమాలతో అన్నదాత ఇంట సిరుల పంట పండుతున్నది. 2014 వానకాలం సీజన్‌లో 2,18,966 ఎకరాల్లో సాగు జరగ్గా, 2022 వావకాలం సీజన్‌లో 4,45,779 ఎకరాల్లో పంటసాగు జరిగిందంటే అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ తెస్తామన్న కౌలుదారు చట్టంతో భయపడి రైతులు కౌలుకు ఇచ్చే బదులు బీడు పెడతారే తప్ప.. రిస్క్ తీసుకోరు. అంతే కాకుండా 3 గంటల కరెంట్‌తో సాగునీరు అందదు. 10హెచ్‌పీ మోటార్లు బిగించుకోవడం అంతసులువు కాదు. పైగా అదనపు భారం పడుతుంది. ఫలితంగా సాగు విస్తీర్ణంతోపాటు ఉత్పత్తి తగ్గిపోతుంది. దీంతో ఆహార ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

### మళ్లీ వలసలు..

సాగు విస్తీర్ణం, ఉత్పత్తి తగ్గితే అన్ని రంగాలపై ఎఫెక్ట్ పడుతుంది. గ్రామాల్లో 70 శాతం వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఆదాయాన్ని కోల్పోతాయి. గ్రామాల్లో ఉపాధి, కూలీలపై ప్రభావం చూపుతుంది. ఇప్పుడు కూలీలకు మస్తు డిమాండ్ ఉంది. ఇతర రాష్ర్టాల కూలీలు సైతం మన దగ్గర ఉపాధి పొందుతున్నారు. సాగు విస్తీర్ణం తగ్గడంతో ఆటోమెటిక్ కూలీల అవసరం రాదు. గ్రామాల్లో పని దొరకదు. చేసేదం లేక ఉమ్మడి రాష్ట్రంలో మాదిరి మనమే ఇతర రాష్ర్టాలకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

### భూ కబ్జాలు పెరుగుతయ్

ధరణి పోర్టల్ రద్దు చేసి పాత రెవెన్యూ విధానాన్ని తీసుకొస్తే భూములు కబ్జాకు గురవుతాయి. ధరణి పోర్టల్‌తోనే రైతులకు భరోసా పెరుగుతుంది. పట్వారీ వ్యవస్థపోయి ఇప్పుడు మంచిగా ఉన్నది. భూముల కొనుగోలు, అమ్మకాలతోపాటు మ్యుటేషన్ లాంటివి తొందరగా జరిగిపోతున్నవి. సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని దేశంలోనే మొదటిస్థానంలో నిలిపారు. ధరణి ఉండాలంటే రైతులమంతా కేసీఆర్ వెంటే ఉండాలి.



–కోల లక్ష్మయ్య, రైతు, ఆత్మకూరు(ఎం)

### కోట్లు పలికిన భూముల ధరలు కిందికొస్తయ్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీఎం కుర్చీ కోసం కొట్లాటలే ఉంటాయి. అభివృద్ధి, సంక్షేమం అనే మాట ఉండదు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుబడి రియల్ ఎస్టేట్ ఢమాల్ అంటుంది. కోట్లు పలికిన భూముల ధరలు మళ్లీ మొదటికి వస్తాయి. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని రంగాలను అభివృద్ధి చేయడంతో మారుమూల పల్లెల్లో సైతం భూముల ధరలు కోట్లల్లో పలుకుతున్నాయి. దాంతో రైతాంగమంతా కొండంత భరోసాతో ఉన్నారు. సీఎం కేసీఆర్‌కు మళ్లీ అధికారం ఇస్తే భూముల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టితే భూముల ధరలు పూర్తిగా పడిపోయి బీళ్లుగా మారడం ఖాయం.

–చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, రైతు సంఘం నాయకుడు, రేణికుంట, రాజాపేట



### రైతులు రోడ్డున పడడం ఖాయం

రేవంత్‌రెడ్డి అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి రావాలని పగటి కలలు కంటున్నాడు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ బూటకమే. పూటకో పార్టీ, పూటకో మాట మాట్లాడే రేవంత్‌రెడ్డి అధికారంలోకి రావద్దు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయ భూములు బీడు భూములుగా మారిపోతాయి. రైతుల బతుకులు బజారున పడుతాయి. కేసీఆర్ సార్ ఇస్తున్న 24 గంటల కరెంటు, రైతుబీమా, రైతుబంధు మాకు చాలు. రైతులను కేసీఆర్ సార్ కడుపుల పెట్టుకుని చూసుకుంటుండు. రైతు రాజు కావాలంటే అది కేసీఆర్ సార్‌తోనే సాధ్యమైతది.



–బొడ్డుపల్లి గాలయ్య, రైతు, సంస్థాన్‌నారాయణపురం

### కాంగ్రెస్ మాట వింటే పచ్చని భూములు మారుతయ్

కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలతో సాగు భూములు బీళ్లుగా మారుతాయి. 3 గంటల కరెంట్ అంటే ఆరు గుంటల భూమి కూడా పారదు. ఆర్థిక భారంతో 10 హెచ్‌పీ మోటర్లు కొని వాడినా ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతాయి. కౌలు రైతులకు రైతుబంధు ఇచ్చి, భూ యజమానికి ఇవ్వమని చెప్పడంతో ఇద్దరి మధ్య పంచాయతీ పెట్టడమే. పంచాయతీల మధ్య భూముల రేట్లు పూర్తిగా తగ్గిపోతాయి. వ్యవసాయ రంగం దెబ్బతింటుంది. మళ్లీ పాతకాలం నాటి రైతు ఆత్మహత్యలే శరణ్యమవుతాయి. రైతులు ఈ విషయంపై ఆలోచన చేసి రైతు పక్షపాతి ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలి.



–కూనూరు శ్రీనివాస్, న్యాయవాది, బోగారం, రామన్నపేట